ఆ మహాత్ముడు సత్సంగంలో పాపంచేస్తే కష్టాలు, పుణ్యంచేస్తే సుఖాలు వస్తాయనే విషయాన్ని చెప్పాడు. దాంతో లక్ష్మీపతి కృష్ణదాసుతో ఎద్దేవాగా చెప్పాడు.

"అసలు పాపం, పుణ్యం అంటూ ఏం లేవు. నేను రోజూ వేశ్య దగ్గరకి వెళ్తున్నా, నాకో బంగారు నాణెం లభించింది. నువు రోజూ ఈ సత్సంగానికి వస్తున్నా నీకు కాల్లో ముల్లు గుచ్చుకుంది."

ఆ మాటలు ఆ మహాత్ముడి చెవిలో కూడా పడ్డాయి. ఆయన చిన్నగా నవ్వి లక్ష్మీపతి వంక చూస్తూ చెప్పాడు.

"నీకు తెలిసింది నువ్వు చెప్పావు. నీకు తెలియనిది, నేను చెప్పేది విను. నువ్వు పూర్వ జన్మలో ఓ బంగారు నాణాన్ని ఓ బీదవాడి కూతురి పెళ్ళికై దానం చేసావు. ఆ పుణ్య ఫలంగా ఈ జన్మలో నీకు వంద బంగారు నాణాలు లభించాల్సి ఉంది. కాని నువ్వు గత తొంభైతొమ్మిది రోజులుగా వేశ్య దగ్గరకి వెళ్ళినప్పుడల్లా ఒకో బంగారు నాణెం బొగ్గుగా మారింది. ఆమె గ్రామం విడిచి వెళ్ళిపోవడంతో చివరకి ఒకటే నీకు దక్కింది. ఇక కృష్ణదాసు సంగతి విను. అతను గత జన్మలో రక్షక భటుడిగా ఉద్యోగం చేస్తూ, అనుమానితులని నేరం ఒప్పుకోమని బాగా హింసించేవాడు. ఆ పాప ఫలితంగా ఇవాళ అతని కాలు తెగిపోవాల్సి ఉంది. కాని తొంభై తొమ్మిది రోజులుగా అతను ఈ సత్సంగానికి వస్తున్న పుణ్య విశేషం వల్ల పాపఫలం తగ్గి, చిన్న ముల్లుతో శిక్ష తప్పింది. అందువల్ల దైవచింతన చేయడం మనకే లాభం."

## 67. విగ్రహారాధన

దేవుడికి ఆకారం కాని, నామ రూపాలు కాని ఉండవని రంగాచారి అనేకమంది మహాత్ములు చెప్పగా విని ఉన్నాడు. దాంతో అతను దేవుడికి ఓ గుడి కట్టి, ఓ విగ్రహాన్ని ప్రతిష్టించి 'దేవుడు ఇక్కడ ఉన్నాడు' అని చెప్పడంలో

ఔచిత్యం లేదని భావించసాగాడు. దాంతో రంగాచారి గుడికి వెళ్ళడం మానుకున్నాడు. అలా వెళ్ళేవాళ్ళని చులకనగా కూడా చూడసాగాడు.

ఆది శంకరాచార్యులు తమ పర్యటనల్లో భాగంగా ఓ సారి ఆ ఊరి మీంచి వెళ్తూ ఆ రాత్రికి అక్కడ ఆగారు. మర్నాడు శంకరాచార్యులవారు ఆ ఊళ్ళోని జీర్ణావస్థలో ఉన్న ఓ ప్రాచీన ఆలయాన్ని పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ ఊళ్ళోని ధనవంతుడు, దైవ భక్తుడు అయిన రంగాచారిని ఆ కార్యక్రమానికి ఆయన ఆహ్వానించదలిచారు. ఆ గ్రామస్తులు అందుకు అభ్యంతరం చెప్పారు.

"స్వామీ! రంగాచారి గొప్ప భక్తుడనడంలో ఎలాంటి సందేహం లేదు. కాని అతనికి విగ్రహారాధన అంటే గిట్టదు. పిలిచినా రాడు. పైగా మిమ్మల్ని అపహాస్యం చేస్తాడు."

అంతటి భక్తుడిని శంకరాచార్యులవారు సంస్కరించ దలచుకన్నారు. దాంతో విగ్రహ ప్రతిష్ట రోజు ఉదయం ఆయన రంగాచారి ఇంటికి వెళ్ళాడు. ఓ చెట్టు నీడన కూర్చుని రంగాచారి విసనకర్రతో విసురుకుంటూ కనిపించాడు. గీత చదువుకుంటున్న రంగాచారిని చూసి శంకరాచార్యులు ఇలా ప్రశ్నించారు.

"అయ్యా! నాకు రెండు సందేహాలున్నాయి. తీరుస్తారా?"

ఆయనెవరో తెలీని రంగాచారి చెప్పాడు.

"అడగండి. ప్రయత్నిస్తాను."

"మనిషి గాలిని అన్ని చోట్లా అనుభవించే అవకాశం ఉంది కదా?"

ఉందన్నట్టుగా తల ఊపాడు రంగాచారి.

"మరి మీరు విసనకర్రతో విసురుకుంటూ దాన్ని అనుభవించాలని ఎందుకు ప్రయత్నిస్తున్నారు?"

ఆయన తనకేదో బోధించడానికి వచ్చాడని అర్థం చేసుకున్న రంగాచారి జవాబు చెప్పకుండా అడిగాడు.

"మీ రెండో సందేహం?"

"నీడ అనేక చోట్ల ఉన్నా మీరు చెట్టునీడనే ఎందుకు ఆశ్రయించారు?"

"మీ ప్రశ్నలకి జవాబులు నాకు తెలీవు స్వామి. మీరే చెప్పండి." రంగాచారి అర్థించాడు.

"భగవంతుడు నిరాకారుడైనా అది గ్రహించలేని వారికోసం ఇంద్రియాల ద్వారా వ్యక్తం అవడానికి ఆకారం ధరించాడు. మామూలు నీడలో కన్నా చెట్టు నీడన ఎక్కువ చల్లదనం అనుభవించడం లాగానే, అలాంటి వారు తనని చూడటానికి అనువుగా భగవంతుడు గుళ్ళో విగ్రహంగా వెలుస్తాడు. ఎండు చేపల తయారీ కార్ఖానాలో చేపల వాసనే వస్తుంది. అత్తరు తయారు చేసే కార్ఖానాలో అత్తరు వాసనే వస్తుంది. అలాగే పవిత్ర దేవాలయ ప్రాంగణంలో భక్తి రసం నిండివుండి, మనసు తేలికగా దైవం మీదకి మళ్ళించే వాతావరణం కలిగి ఉంటుంది."

తనలోని అజ్ఞానాన్ని పారదోలిన ఆయనకి రంగాచారి సాష్టాంగ ప్రమాణం చేసి, ఆ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనడమే కాకుండా, ధన సహాయాన్ని కూడా చేసాడు.

## 68. ఉపదేశానికి అర్హత

ఓ రాజుకి ఆధ్యాత్మిక జీవితం మీద ఆసక్తి కలిగింది. కాశీలోని ఓ గురువు దగ్గరకి వెళ్ళి తనని శిష్యుడిగా స్వీకరించమని కోరాడు.

"నువు రాజువి. నేను సామాన్య మానవుడ్ని. కాబట్టి నిన్ను నేను శిష్యుడిగా స్వీకరించలేను." ఆ గురువు అందుకు ఒప్పుకోలేదు.

రాజు బతిమాలాడు. గురువు భార్యకి ఆ రాజు మీద జాలి కలిగి, ఆయన్ని శిష్యుడిగా స్వీకరించేందుకు తన భర్తని ఒప్పించింది. ఆ రాజుకి గురువు అంట్ల పాత్రలు తోమడం, ఇల్లు ఊడవడం లాంటి కనాకష్టమైన